## క్లుప్తంగా

### బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

**ఇబ్రహీంపట్నం రూరల్:** కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని అసెంబ్లీలో తీర్మానం చేసింది. ఆపై కేంద్రానికి పంపింది. ఆర్డినెన్స్ ఇవ్వకుండా బీజేపీ అడ్డుకోవడం సిగ్గుచేటని కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ జహంగీర్‌ఖాన్ విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఢిల్లీలో ధర్నా చేస్తోందని కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ అనడం సరికాదన్నారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు పెంచి, ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో తప్పేముందని ప్రశ్నించారు. రిజర్వేషన్లు అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి ఆలోచించి వెంటనే ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీసీ వ్యతిరేఖ పార్టీగా బీజేపీ మిగిలిపోవడం ఖాయమన్నారు.

### లక్ష బిల్వార్చన మహోత్సవం



స్వామివారికి బిల్వార్చన పూజలు

**ఆమనగల్లు:** ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామం అయ్యసాగరం అటవీ క్షేత్రంలో వెలసిన శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి దేవాలయంలో 9 రోజుల పాటు నిర్వహించే లక్ష బిల్వార్చన మహోత్సవం ప్రారంభమైంది. ఆదివారం ఉదయం అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, గణపతిపూజ, అనంతరం బిల్వార్చన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### స్నేహితుడి కుటుంబానికి బాసట



బాధిత కుటుంబానికి డిపాజిట్ పత్రం అందజేస్తున్న స్నేహితులు

**యాచారం:** స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచారు. మండల పరిధి చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన మారోజ్ సద్గుణాచారి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. చారితో నందివనపర్తి ఉన్నత పాఠశాలలో 2008- 09 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన బాల్య మిత్రులు.. ఆదివారం బాధిత కుటుంబానికి.. మృతుడి కూతురు శ్రీయాన్సి పేరిట రూ.50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన పత్రాన్ని అందజేశారు. భవిష్యత్తులో అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

### ఘనంగా పోచమ్మ బోనాలు




చింతుల్లలో బోనాల ఊరేగింపు

**యాచారం:** మండల పరిధి పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. యాచారం, చౌదర్‌పల్లి, చింతుల్ల, నందివనపర్తిలో.. డప్పుచప్పుళ్ల నడుమ, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో నెత్తిన బోనంతో మహిళలు ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. అనంతరం అమ్మవార్లకు నైవేద్యంగా బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

### పండుగ వేళ ఆర్టీసీ నిలువు దోపిడీ

- స్పెషల్ పేరుతో టికెట్ ధర పెంపు



కందుకూరు-కడ్తాల్‌కు వసూలు చేసిన టికెట్ రుసుం

**కందుకూరు:** రాఖీ పండుగ వేళ ఆర్టీసీ ప్రయాణికులను నిలువు దోపిడీ చేసింది. ఏకంగా టికెట్ ధర 66శాతానికి పైగా పెంచి వసూలు చేసింది. దీంతో ప్రయాణికులు నోరువెళ్లబెట్టాల్సి వచ్చింది. కందుకూరు చౌరస్తా నుంచి కడ్తాల్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలంటే సాధారణంగా రూ.30 టికెట్ ధర ఉంది. కాగా రాఖీ పండుగ వేళ శనివారం రాత్రి ఓ ప్రయాణికుడు కందుకూరు చౌరస్తాలో అచ్చంపేట ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కి కడ్తాల్ టికెట్ తీసుకున్నాడు. కండక్టర్ మాత్రం రూ.50 టికెట్ చేతిలో పెట్టింది. సాధారణంగా రూ.30 టికెట్ ఉండగా.. రూ.50 ఎందుకు ఇవ్వాలని ప్రయాణికుడు ప్రశ్నించడంతో పండుగకు స్పెషల్ బస్సు నడిపిస్తున్నామని, అందుకు పెంచామని కండక్టర్ తెలిపారు.

# వానొస్తే.. వణుకే



సాగర్ రోడ్డుపై నిలిచిన నీరు

- చెరువులను తలపిస్తున్న సాగర్‌హైవే
- అడుగుల మేర నీటితో వాహనదారుల ఇబ్బంది

**తుర్కయంజాల్:** మొన్నటి వరకు కలిసిరాని కాలం, సాగునీటి ఎద్దడితో కంటిమీద కునుకులేకుండా కలత చెందిన కర్షకులు.. అడుగంటిన భూగర్భ జలాలతో తాగునీటి కష్టాలను ఎదుర్కొన్న పట్టణ ప్రజలు.. ప్రస్తుత వర్షాలతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో పట్టణ, శివారు, నగర వాసులు ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి వానలకే లోతట్టు ప్రాంతాల్లు జలమయం కావడం, ఇళ్లను ముంచెత్తడం, జాతీయ రహదారులపై అడుగుల మేర వరద నిలువ, ప్రవాహంతో భయాందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఎలాంటి ముప్పు ఎదుర్కోవాల్సి వస్తుందోనని ఆందోళనకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షం పడితే వణికిపోతున్నారు. తుర్కయంజాల్ వాసులు అవే కష్టాలను ఎదుర్కొంటున్నారు. నిన్నమొన్న కురిసిన వానలతో సాగర్ రహదారిపై భారీగా నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఏళ్లుగా వరద సమస్య ఉన్నప్పటికీ.. ఆర్‌అండ్‌బీ అధికారులు తగిన పరిష్కారం చూపడం లేదు.

**మన్నెగూడ చౌరస్తాలో..**

చిన్నపాటి వర్షంతో మన్నెగూడ చౌరస్తాలో అడుగు మేర నీరు నిలుస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడే ఉన్న బస్‌స్టాప్‌లో దేవరకొండ, మాచర్ల, వినుకొండ, ఇబ్రహీంపట్నం వైపు నుంచి వచ్చే బస్సులను నిలుపుతారు. వరద వలన ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. రాగన్నగూడ గణేశ్ దేవాలయానికి సమీపంలో అదే పరిస్థితి. మాసబ్ చెరువు కట్ట వాగు వంతెనపై అడుగున్నరకు పైగా నీరు నిలుస్తున్నాయి. ఇక్కడ రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగకపోవడం, రోడ్డుపై నిలిచిన నీటితో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం లేకపోలేదు. ఒంపుగా ఉన్న బ్రాహ్మణపల్లిలో పై నుంచి వచ్చే వరద అక్కడ చేరుతుంది. దీంతో అది కుంటను తలపిస్తుంది. ఏటా ఇలాంటి పరిస్థితులే ఎదురువుతున్నాయని, సంబంధిత అధికారులు వరద ముప్పు, నీటి నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

> **చర్యలు చేపడతాం**
>
> ప్రస్తుతం పడుతున్న వర్షాలతో చాలా రోడ్లపై నీరు నిలుస్తోంది. క్షుణ్ణంగా పరిశీలిస్తాం. నీటి నిలవడానికి గల కారణాలు తెలుసుకుంటాం. వరద ముందుకు ప్రవహించేలా చర్యలు చేపడతాం. వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.
>
> – మణిశంకర్, అర్‌అండ్‌బీ, ఏఈ

# ఇంటింటికీ కమలనాథులు



యాచారం: తాడిపర్తిలో ప్రచారం చేస్తున్న బీజేపీ శ్రేణులు

**సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం**

**యాచారం:** స్థానిక సంస్థల ఎన్నికల్లో పల్లెల్లో బీజేపీ జెండాను ఎగుర వేస్తామని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తంచేస్తున్నారు. మహా సంపర్క్ కార్యక్రమంలో భాగంగా వారం రోజులుగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు విజయనాయక్ ఆధ్వర్యంలో కమలనాథులు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. మండలంలోని మొండిగౌరెల్లి, నందివనపర్తి, నస్దిక్‌సింగారం, చింతుల్ల, ధర్మన్నగూడెం, తాడిపర్తి గ్రామాల్లో పర్యటిస్తున్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తూ.. ప్రచారం చేస్తున్నారు. కేంద్రం నిధులతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొంటున్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

**హామీల అమలులో ప్రభుత్వం విఫలం**

**ఆమనగల్లు:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రంరెడ్డి ఆరోపించారు. ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 11న ఆమనగల్లు పట్టణంలో నిరసన ర్యాలీ, సభ నిర్వహించనున్నామని తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన రైతులకు రైతుభరోసా, రుణమాఫీ చెల్లించాలన్నారు. వృద్ధాప్య పింఛన్లు రూ.4 వేలు, వికలాంగుల ఆసరా 6 వేలకు పెంచాలని కోరారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలు చేయాలనే డిమాండ్ చేపట్టనున్న సభకు పార్టీ జాతీయ నేత ఆచారి పాల్గొననున్నారని, పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేపీ కౌన్సిల్ సభ్యుడు లక్ష్మణ్, నాయకులు రవిరాథోడ్, శ్రీను, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: సమావేశంలో బీజేపీ నాయకులు

### విజేతలకు బహుమతుల అందజేత

**కందుకూరు:** మండల పరిధిలోని రాచులూరులో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో ఆదివారం సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేశారు. జస్వంత్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ప్రథమ స్థానంలో నిలిచిన ముంబై ఇండియన్ జట్టుకు రూ.14వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన పంజాబ్ జట్టుకు రూ.7వేలతో పాటు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పి.కృష్ణగౌడ్, బి.రాంరెడ్డి, ఇ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


# ఉట్టిపడిన ఆధ్యాత్మిక శోభ



పోచమ్మ అమ్మవారి ఊరేగింపులో శివసత్తులు

**ఘనంగా పోచమ్మ బోనాలు**

**ఇబ్రహీంపట్నం:** ఊర పోచమ్మ బోనాల ఉత్సవాలతో ఇబ్రహీంపట్నంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. ఏటా ఆషాఢ మాసంలో మహంకాళి, శ్రావణ మాసంలో పోచమ్మ బోనాల పండుగ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆదివారం అమ్మవార్లకు బోనం ఎత్తడంతో పట్టణమంతా శోభాయమానంగా మారింది. వాడవాడలా బోనాల ఊరేగింపులు దర్శనమిచ్చాయి. ఈ సందర్భంగా విద్యుత్ దీపాలతో స్వాగత తోరణాలు, అమ్మవారి చిత్రపటాలను ఏర్పాటు చేశారు. భక్తిగీతాలతో పరిసరాలు మారుమోగాయి. అమ్మవారి ఆలయాలకు భక్తుల తాకిడి ఉదయం నుంచి ప్రారంభమైంది. సాయంత్రం పెద్ద సంఖ్యలో భక్తులు నెత్తిన బోనంతో ఊరేగింపుగా అమ్మవారి సన్నిధి చేరుకున్నారు. నైవేద్యంగా బోనం, తొట్టెలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. అలయం వద్ద భక్తుల కోలాహలం నెలకొంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుకాణాలు కిటకిటలాడాయి. ఉత్సవం నేపథ్యంలో అమ్మవారిని ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పలువురు నేతలు దర్శించుకొని పూజలు చేశారు. అలయ చైర్మన్ ముత్యాల భాస్కర్, సభ్యులు వారికి ఆహ్వానం పలికి, సన్మానించారు.



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి తదితరులు



అలయం వద్ద శివసత్తుల విన్యాసం

### పద్మశాలీ సంఘం ప్రధాన కార్యదర్శిగా మహేశ్



**ఆమనగల్లు:** పద్మశాలీ యువజన సంఘం ఆమనగల్లు మండల ప్రధాన కార్యదర్శిగా మహేశ్‌ను నియమించారు. పట్టణంలోని భక్తమార్కండేయస్వామి దేవాలయంలో ఆదివారం జరిగిన పద్మశాలీ సంఘం సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి శివలింగం, కోశాధికారి సత్యరాములు, యువజన సంఘం అధ్యక్షుడు మామిడిశెట్టి రవి ఆధ్వర్యంలో మహేశ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యదర్శిని సన్మానించారు.

### రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

- 13వ తేదీతో గడువు ముగింపు
- మండల వ్యవసాయ అధికారిణి విద్యాధరి

**ఇబ్రహీంపట్నం:** అర్హులైన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 13వ తేదీలో గడువు ముగియనుందని ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయ అధికారిణి విద్యాధరి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 5వ తేదీ వరకు కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు(కొత్తగా భూమి కొనుగోలు చేసిన రైతులు) పొందిన వారు స్వయంగా క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారికి దరఖాస్తులు అందజేయాలని సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు తిరిగి చేయాల్సిన అవసరంలేదని పేర్కొన్నారు. అయితే రైతు బీమాలో కుటుంబ సభ్యుల వివరాలు మార్చుకునే వెసులుబాటు ఉందన్నారు. 18 నుంచి 59 సంవత్సరాల లోపు రైతులు.. బీమా ఫారం, పట్టాదారు పాసు పుస్తకం, రైతు, నామిని ఆధార్ కార్డుల జిరాక్స్ ప్రతులతో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

**ఆమనగల్లులో..**

**ఆమనగల్లు:** అర్హులైన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో కోరారు. ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలతో ఈ నెల 13 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయం



మాడ్గుల: పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే కసిరెడ్డి

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి**

**మాడ్గుల:** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో పలువురు పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. పదవుల కోసం ఎవరూ ఆరాట పడవద్దని, పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొండల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సాయిరెడ్డి, నర్సింహ్మ తదితరులు నాయకులు పాల్గొన్నారు.

**బోనాలకు ఆహ్వానం**

**కడ్తాల్:** మండల కేంద్రంలో ఈ నెల 16 నుంచి 19 వరకు జరగనున్న బోనాల ఉత్సవాలకు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మార్కెట్ చైర్ పర్సన్ యాటగీతలను ఉత్సవ కమిటీ నాయకులు ఆహ్వానించారు. ఆదివారం మండల కేంద్రంలో పోచమ్మ అలయ కమిటీ చైర్మన్ సత్యంయాదవ్ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఇందులో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాజేశ్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, ఉత్సవ కమిటీ సభ్యులు రాములు, మల్లేశ్‌గౌడ్, కార్తీక్ ఉన్నారు.

# మరోసారి అధికారం చేపట్టేందుకు కుట్ర

**తుర్కయంజాల్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరోసారి అధికారం చేపట్టే కుట్రలో భాగంగానే బీహార్‌లో భారీగా ఓట్లను తొలగించిందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య ఆరోపించారు. ఆదివారం ఆ పార్టీ మున్సిపాలిటీ కార్యదర్శి కాటం రాజు ఆధ్వర్యంలో రాగన్నగూడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అధికార పార్టీ అండదండలతో ప్రభుత్వ భూముల కబ్జాలు కొనసాగుతూనే ఉన్నాయని, పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే వరకు పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం ఈ నెల 19 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లాలో నిర్వహించనున్న పార్టీ రాష్ట్ర మహాసభల గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఈదులకంటి అనురాధ, కృష్ణయ్య, విజయ, శివ ప్రసాద్, శ్రీకాంత్, భాస్కర్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన సీపీఐ నాయకులు

# మద్యం తాగి వాహనాలు నడపొద్దు



మహిళతో మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

**ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు**

**యాచారం:** మద్యం సేవించి వాహనాలు నడిపితే బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు హెచ్చరించారు. మండల పరిధి నందివనపర్తి గ్రామంలో ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీలు చేపట్టారు. మత్తులో వాహనాలు నడిపితే.. ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. రోడ్డు నిబంధనలు అతిక్రమించరాదని సూచించారు. బోనాలు, వినాయక చవితి పండుగల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అత్యవసర సమయాల్లో 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ మధు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి

**చేవెళ్ల:** తాము చదివిన పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకొచ్చి.. మరుగుదొడ్ల నిర్మాణానికి కృషి చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 1990లో 7వ తరగతి చదవిన పూర్వ విద్యార్థులు బండారి చెన్నారెడ్డి, కనకమామిడి తిరుపతిరెడ్డి, దేవర వెంకట్‌రెడ్డి, ముచ్చ అమరేందర్‌యాదవ్, మల్గారి లక్ష్మారెడ్డి, గడ్డం దయానంద్ కలిసి రూ.5లక్షల నిధులతో మరుగుదొడ్లు, మౌలిక వసతుల కల్పనకు సహకారం అందించారు. చేవెళ్లకు చెందిన రెడ్డిశెట్టి శ్రీనివాస్ పర్యవేక్షణలో వారందరూ ఈ అభివృద్ధి పనులు చేపట్టారు. ఆదివారం వారందరూ కలిసి పనులను ప్రారంభించారు. పాఠశాలకు సహకారం అందించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావటం అభినందనీయమని రెడ్డివెట్టి శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. దీంతో పాటు చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి తన జన్మదినం సందర్భంగా ప్రత్యేకంగా మరో లక్ష రూపాయలను పాఠశాల అభివృద్ధికి అందజేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో చేవెళ్ల గ్రామ నాయకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

# హైవేరోడ్డు.. అడ్డగోలు పార్కింగ్

- పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్
- వేగనియంత్రణ చర్యలు నిల్
- అవస్థల్లో వాహనదారులు
- పాదచారులకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

**ఆమనగల్లు:** అదీ జాతీయ రహదారి. అయినా ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ లేదు. ఉన్నా అది అలంకార ప్రాయమే. పోలీసుల పర్యవేక్షణ కరువు. వేగనియంత్రణ చర్యలు శూన్యం. రోడ్డుకు ఇరువైపులా దుకాణ సముదాయాలు, వాటి ఎదురుగా చిరువ్యాపారుల ఆక్రమణలు. ఇష్టానుసారంగా వాహనాల నిలిపివేత. వెరసి నిత్యం వెంటాడుతున్న ట్రాఫిక్ కష్టాలు. కాలినడక వెళ్లలేని దుస్థితి. ఇదీ ఆమనగల్లు పట్టణం గుండా వెళ్తున్న హైదరాబాద్– శ్రీశైలం హైవే దుస్థితి.

**ఆక్రమణలతో అవస్థలు**

పట్టణంలోని జాతీయ రహదారితో పాటు మాడ్గుల, షాద్‌నగర్ రోడ్లు ఉన్నాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఆయా మార్గాల్లో ట్రాఫిక్ ఇక్కట్లు చెప్పలేనివి. ఇక బస్టాండ్ ఎదుట, మాడ్గుల రోడ్డులో గాంధీ కూడలి వద్ద, షాద్‌నగర్ రోడ్లపైనే ఇష్టాను సారంగా ఆటోలను నిలిపి ఉంచుతున్నారు. వీటి వలన ఇతర వాహన దారులకు ఇబ్బందిగా మారింది. బస్టాండ్ ఎదుట ఆర్టీసీ బస్సులు తిరగలేని పరిస్థితి ఏర్పడింది.



రోడ్డుపైనే నిలిపిన ద్విచక్రవాహనాలు

**తరచూ ప్రమాదాలు**

హైవేపై పలు చోట్ల రెండేళ్ల క్రితం ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. కానీ వాటిని ప్రారంభించలేదు. దీంతో అవి అలంకారప్రాయంగా మారాయి. ట్రాఫిక్ సిగ్నల్ లేక, వేగ నియంత్రణ, పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో వాహనాల పరుగులకు అంతులేకుండా పోయింది. వాహన చోదకులు కనీస ప్రమాణాలు పాటించకపోవడం వలన రాజీవ్‌చౌరస్తా వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ.. పోలీసులు ప్రమాదాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అప్పుడప్పుడు వాహనాల తనిఖీల్లో భాగంగా జరిమానాలు విధిస్తూ చేతులు దులుపుకొంటున్నారు. ఇప్పటికైనా రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిని కట్టడి చేయడంతో పాటు.. అడ్డగోలు పార్కింగ్‌ను అరకట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ట్రాఫిక్ సిగ్నల్ ప్రారంభించి, వేగనియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



నిరుపయోగంగా ట్రాఫిక్ సిగ్నల్స్